'రైతులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి'

సీతానగరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూమి కలిగిన ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. బుధవారం గుచ్చిమి గ్రామంలో జరిగిన రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెలతో ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఆధార్ తరహాలో అందిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, రాయితీలు పొందేందుకు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వినతులు 46,446

- ఇందులో పీజీఆర్ఎస్‌వి 32,803..
- రెవెన్యూ శాఖవి 7,173
- ప్రభుత్వ నివేదిక ద్వారా వెల్లడి

పార్వతీపురం,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): వినతుల స్వీకరణలో పార్వతీపురం మన్యం జిల్లా ముందంజలో ఉంది. ఈ మేరకు ప్రభుత్వం నివేదిక ద్వారా ప్రకటించింది. 26 జిల్లాల్లో మన్యం జిల్లాకు అత్యధిక అర్జీలు వచ్చాయని స్పష్టం చేసింది. పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, ఇతర కార్యక్రమాల ద్వారా వివిధ సమస్యలపై మొత్తంగా 46,446 వినతులు వచ్చినట్లు వెల్లడించింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా పాలకొండ డివిజన్‌లో 11,464, పార్వతీపురం డివిజన్‌లో 21,339 వినతులు అందాయి. ఇందులో 10,778 వినతులను పరిష్కరించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా పాలకొండ డివిజన్‌లో 2,895, పార్వతీపురం డివిజన్‌లో 4,278 అర్జీలు వచ్చాయి. ఇందులో 2,470 సమస్యలు పరిష్కరించారు.

మండలాల వారీగా పీజీఆర్ఎస్ ద్వారా..

- పీజీఆర్ఎస్ ద్వారా జిల్లా ఉన్నతాధికారులకు 100 వినతులు, పాలకొండ సబ్ కలెక్టర్‌కు 30 అర్జీలు వచ్చాయి. మండలాల వారీగా చూస్తే.. సీతంపేట మండలంలో 867, జియ్యమ్మవలసలో 2,059, కురుపాంలో 778, పాలకొండలో 2357, భామినిలో 1784, గుమ్మలక్ష్మీపురంలో 834, వీరఘట్టంలో 2705 చొప్పున అర్జీలు వచ్చాయి.



- పార్వతీపురం డివిజన్‌లో సబ్‌కలెక్టర్‌కు 132 వినతులు రాగా ఈ డివిజన్‌లో మండలాల వారీగా చూస్తే.. మక్కువలో 1386, గరుగుబిల్లిలో 1290, కొమరాడలో 4,254, పాచిపెంటలో 1920, బలిజిపేటలో 4,214, పార్వతీపురంలో 3,919, సాలూరులో 10,99, సీతానగరంలో 3125 వినతులు వచ్చాయి.

రెవెన్యూ సదస్సుల ద్వారా..

- జియ్యమ్మవలస మండలంలో 534, వీరఘట్టంలో 273, సీతంపేటలో 519, భామినిలో 573, కురుపాంలో 257, గుమ్మలక్ష్మీపురంలో 384, పాలకొండలో 355 వినతులు వచ్చాయి.
- బలిజిపేటలో 143, గరుగుబిల్లిలో 215, సాలూరులో 354, సీతానగరం 777, కొమరాడలో 373, మక్కువలో 682, పాచిపెంటలో 745, పార్వతీపురంలో 689 విన తులు అందాయి. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేలో జరిగిన తప్పులను సరి చేయాలని అత్యధికంగా ఆర్జీలు వచ్చినట్లు సమాచారం.

పోలీస్ గ్రీవెన్స్‌లో..

- పోలీసు గ్రీవెన్స్‌లో మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. మొత్తంగా 693 వినతులు స్వీకరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.
- గృహ నిర్మాణ శాఖకు 12,720 వినతులు వచ్చాయి.

సబ్ కలెక్టర్లకు అదనపు బాధ్యతలు..

పాలకొండ, పార్వతీపురం సబ్ కలెక్టర్లు ఐటీడీఏల ఇన్‌చార్జి పీవోలుగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. మరోవైపు జిల్లాలో తహసీల్దార్లు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో రెవెన్యూ సమస్యలకు మోక్షం లభించడం లేదు.

పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులతో పాటు వివిధ కార్యక్రమాల్లో వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తాం. ఈ నెలాఖరులోపు అన్ని సమస్యలను పరిష్కరిస్తాం.

- హేమలత, జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య 22,493

- 123 పోలింగ్ కేంద్రాలు
- నామినేషన్ల ఉపసంహరణకు నేడు ఆఖరిరోజు

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి మొత్తం 22,493 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో పురుషలు 13,508, మహిళలు 8,985 మంది ఉన్నారు. అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 5,529 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 568 మంది ఉన్నారు. కాగా ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పూర్తయ్యింది. పది మంది నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం వరకూ గడువు ఉంది. పోలింగ్ కోసం 123 కేంద్రాలు ఎంపిక చేశారు. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది.

జిల్లాల వారీ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు...

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	మొత్తం
శ్రీకాకుళం జిల్లా	31	3,416	1,619	5,035
పార్వతీపురం మన్యం	15	1,574	759	2,333
విజయనగరం జిల్లా	29	3,270	1,953	5,223
అల్లూరి సీతారామరాజు	11	920	568	1,488
విశాఖపట్నం	13	2,539	2,999	5,529
అనకాపల్లి జిల్లా	24	1,789	1,096	2,885
మొత్తం	123	13,508	8,985	22,493

4 బ్యాగులు.. 33 ప్యాకెట్లు

- రూ.15 లక్షల విలువైన గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో ఏఎస్పీ , సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

సాలూరు (పాచిపెంట), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట మండలం మాతుమూరు గ్రీన్ ఫీల్డ్ హైవే జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు 153.62 కేజీల గంజాయిని పట్టుకున్నారు. అయితే రవాణాదారులు మాత్రం పరారయ్యారు. ఏఎస్పీ అంకిత సురాన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు గ్రీన్ ఫీల్డ్ హైవే జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అయితే ఒడిశా నుంచి మాతుమూరు మీదుగా సాలూరు వైపు కారులో సరుకును తీసుకొస్తున్న రవాణాదారులు ఆ జంక్షన్ వద్ద పోలీసులను చూసి పరారయ్యారు. దీంతో అక్కడున్న ఎస్ఐ కె.వెంకట సురేష్, సాలూరు సర్కిల్ టీము వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో నాలుగు గన్నీ బ్యాగుల్లో ఉన్న 33 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేశారు. ఈ గంజాయి విలువ సుమారు రూ. 15 లక్షలు ఉంటుందని ఏఎస్పీ చెప్పారు. గత మూడు నెలల్లో వెయ్యి కేజీల గంజాయిని పట్టుకున్నామన్నారు.

ముమ్మర తనిఖీలు : ఏఎస్పీ

ఒడిశా - ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు పోలీసులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారని ఏఎస్పీ తెలిపారు. పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ.. గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా మాతుమూరు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించా మన్నారు. మహాశివరాత్రికి జరగబోయే పారమ్మ కొండ జాతరకు 120 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నామని వెల్లడించారు. ప్రజలతో పోలీసులు మమేకం అయ్యేందుకు వాలీబాల్ టోర్నమెంట్లు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సదస్సులు నిర్వహిస్తామన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930 , 1972కు నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో సాలూరు టౌన్, రూరల్ సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణ , ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

చొరవ చూపుతారా..

- కొఠియాలో మళ్లీ ఒడిశా దూకుడు
- ఏవోబీ గ్రామాలపై పట్టు కోసం ప్రయత్నాలు
- గత ఏడాది ఎన్నికలతో మారిన పరిస్థితి
- ఇరు రాష్ట్రాల్లో కొలువుదీరిన ఎన్డీయే ప్రభుత్వాలు
- ఆయా ప్రాంతవాసుల్లో చిగురిస్తున్న ఆశలు

వివాదం పరిష్కరిస్తారా?

సాలూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏవోబీ వివాదాస్పద ప్రాంతం కొఠియాలో పట్టు సాధించడం కోసం ఒడిశా మళ్లీ దూకుడు పెంచింది. సాలూరు మండలంలో ఉన్న 21 గ్రామాలపై ఆధిపత్యం కోసం నిత్యం కొఠియాలో గొడవలకు దిగుతోంది. తాజాగా దిగువశెంబి అంగన్‌వాడీ కేంద్రంలో తెలుగులో ఉన్న టీఎల్ఎం పోస్టర్లు, కేంద్రం నేమ్ బోర్డును ఒడిశా అధికారులు తీసుకెళ్లడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఎగువశెంబి, దిగువశెంబి గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డకుని సామగ్రి తీసుకెళ్లడం, అంగన్‌వాడీ సరుకులు, వైద్య సిబ్బంది సేవలు అందించకుండా అడ్డు తగలడం.. కవ్వింపు చర్యలకు పాల్పడడమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీనిపై ఏపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- కొఠియా గ్రూప్‌లో కొఠియా, గంజాయిభద్ర, ఎగువశెంబి, దిగువ శెంబి, గాలిగబడారు, రణసింగి,. దూళిభద్ర, నేరేళ్లవలస, దొరలతాడివలస, పట్టుచెన్నారు, పగులుచెన్నారు, కోనధార, సొలిపిగుడ, డొలియాంబ, అర్జువలస తదితర గ్రామాలు ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల మధ్య వివాదంలో ఉన్నాయి.
- ఈ వివాదం బ్రిటీష్ కాలంలో ఉన్న మద్రాస్ , కోల్‌కతా ప్రెసిడెన్సీల నుంచి కొనసాగుతుంది. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన అనంతరం కొఠియా గ్రామాలు తమవేనంటూ ఒడిశా 1968, మార్చిలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై న్యాయస్థానం స్టేటస్‌కో జారీ చేసింది. అప్పటి నుంచి కొఠియా గ్రామాల్లో ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి
- కొఠియా గ్రూప్ గ్రామాలపై పట్టుకోసం 2018 నుంచి ఒడిశా దూకుడు పెంచింది. ఈ గ్రామాలకు వందలాది కోట్లు వెచ్చించింది. మౌలిక వసతుల కల్పన తదితర వాటికి ఒడిశా ప్రాధాన్యమిచ్చింది.



కొఠియా గ్రామం



దిగువశెంబిలో అంగన్‌వాడీ కేంద్రం ఘటనపై వివరాలు సేకరిస్తున్న ఏపీ అధికారులు (ఫైల్)

- ఏపీ సైతం కొఠియాలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఇదే సమయంలో ఏపీ కార్యక్రమాలను అడ్డుకోవడానికి ఒడిశా గత ఐదేళ్ల నుంచి ప్రయత్నాలు ప్రారంభించింది. ఏపీ నుంచి వెళ్లే అధికారులను ఎప్పటికప్పుడు ఒడిశా అధికారులు అడ్డుకుంటున్నారు. గంజాయిభద్ర గ్రామాలకు వైద్యసేవలకు వెళ్లిన తోణాం పీహెచ్‌సీ వైద్యుడిని రెండుసార్లు అడ్డుకున్నారు. సర్వేకు వెళ్లిన మహిళా పోలీస్, వైద్యసిబ్బందిని

(మిగతా 8వ పేజీలో...)

ఇదే మంచి తరుణం

గతంలో కేంద్రంలో బీజేపీ, ఒడిశాలో బీజేడీ, ఏపీలో వైసీపీ ప్రభుత్వాలు ఉండేవి. దీంతో కొఠియా వివాదం పరిష్కారానికి ఎవరు చొరవ చూపలేదు. పైగా ఒడిశాలో బీజేడీ ప్రభుత్వం వివాదాన్ని రాజేయడానికే చూసింది. గతేడాది జరిగిన ఎన్నికల్లో కేంద్రంలో, ఏపీ, ఒడిశాలో ఎన్డీఏ ప్రభుత్వాలే కొలువుదీరాయి. ఈ నేపథ్యంలో కొఠియా వివాదాన్ని పరిష్కరించడానికి మంచి అవకాశ మేర్పడింది. దీనిపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని ఏవోబీ ప్రజలు కోరుతున్నారు.

ఆకాశవాణి.. వార్తలు వింటున్నారా?

6లో

- నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం
- ఒకప్పుడు బలమైన సమాచార మాధ్యమం



పాఠశాలల విలీనంపై పొరపాట్లకు తావివ్వరాదు: కలెక్టర్



పార్వతీపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లుకు తావివ్వరాదని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారులతో సమీక్షించారు. మండల విద్యాశాఖాధికారులు నిబంధనల మేరకు క్లస్టర్ స్కూల్స్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రూపొందించిన నివేదికను పునఃపరిశీ లించాలని సూచించారు. విద్యార్థుల అనీమియా, బరువు, హెచ్‌బీ వివరాలను గ్రేడ్ విధానంలో విభజించి బంగారు భవిత కార్డులో పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. జేసీ శోభిక, డీఈవో తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలిసి వస్తున్న ఫిబ్రవరి

- రబీలో సాగుకు అనుకూలం
- దిగుబడులు ఆశాజనకం
- పశ్చిమ బెంగాల్ కూలీలతో పనులు



6లో

రేషన్ అందలేే..

- సాంకేతిక లోపంతో ఇబ్బందులు
- ఇంకా రెండు రోజులే గడువు
- ఆందోళనలో కార్డుదారులు
- అధికారులు స్పందించాలని విన్నపం




రేషన్ అందలేదని చెబుతున్న కార్డుదారులు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక లోపం కారణంగా జియ్యమ్మవలసలో రేషన్ పంపిణీ నిలిచింది. ఈ నెలలో ఇంకా రేషన్ అందకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జియ్యమ్మవలస రేషన్ డిపో (0204014) పరిధిలో బొడ్డవలస, కొండసిరిపి కాలనీ, పొట్టిదరవలస, జియ్యమ్మ వలస గ్రామాలు ఉన్నాయి. వాటి పరిధిలో 811 రేషన్ కార్డులున్నాయి. జనవరి నెలకు సరుకుల పంపిణీ జరగ్గా, 40 కేజీల బియ్యం ఓల్డ్ స్టాక్ రూపంలో ఉంది. ఈ నెలకు సంబంధించి 137.50 క్వింటాళ్ల బియ్యం, 811 ప్యాకెట్ల పంచదారను డీలరు హిమరిక గుంపస్వామి విడిపించారు. అంటే మొత్తంగా 137.90 క్వింటాళ్ల బియ్యం, 811 పంచదార ప్యాకెట్లతో ఈ నెల 4న సరుకుల పంపణీ ప్రారంభించారు. ఆరోజు 119 కార్డులకు బియ్యం, పంచదార అందించారు. అప్పటికి రేషన్ డీలరు లాగిన్‌లో పూర్తిస్థాయిలో రేషన్ ఉన్నట్లు చూపించింది. 5న పంపిణీకి సిద్ధమైన తరుణంలో రేషన్ డీలరు లాగిన్‌లో జీరో చూపించడంతో పంపిణీని నిలిపివేశారు. ఈ విషయాన్ని తహసీల్దార్ ఆర్.పకీరు, జిల్లా సివిల్ సప్లైస్ అధికారులకు డీలర్ తెలియజేసినా ప్రయోజనం కనిపించలేదు. ఇంకా 681 రేషన్ కార్డులకు సరుకుల అందకపోవడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 15వ తేదీతో పంపిణీ సమయం పూర్తవుతుండడంతో వారంతా టెన్షన్ పడుతున్నారు. రెండు రోజుల్లో అందరికీ ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నిస్తున్నారు. రేషన్ పంపిణీ చేయకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

అధికారులు ఏమన్నారంటే..

దీనిపై సివిల్ సప్లైస్ కార్యాలయ అధికారులను వివరణ కోరగా 'ఇది సివిల్ సప్లైస్ కమిషనరేట్‌లో జరిగిన సాంకేతిక తప్పిదం. అందుకే విషయాన్ని కమిషనరేట్‌కు తెలి యజేశాం. ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై జిల్లా అధికారులు, కలెక్టర్ ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.' అని తెలిపారు.

శివ్వాంలో గజరాజులు



గరుగుబిల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం సుంకి పౌర సరఫరాల గోడౌన్ ప్రాంతంలో మంగళవారం హల్‌చల్ చేసిన ఏనుగులు సంతోషపురం మీదుగా పిట్టలమెట్టకు చేరాయి. కాగా బుధవారం నాగావళి నది మార్గాన శివ్వాం పరిసరాలకు చేరుకున్నాయి. దీంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పంట, ఆస్తి, ప్రాణ నష్ట సంభవించకముందే అటవీశాఖాధికారులు స్పందించి వాటిని తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పది మంది ఫారెస్ట్ సిబ్బంది ఏనుగులను పర్యవేక్షిస్తున్నారు. ప్రజలకు ప్రమాదం వాటిల్లకుండా చర్యలు చేపడుతున్నారు. అయితే పంటల ధ్వంసంతో రైతులు నష్టాలబారిన పడుతున్నారు.



పుష్కరిణి అద్దంలో కొండ అందాలు

విజయనగరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలోని సీతారామస్వామి దేవాలయం చెంతనే శేషాచలం కొండ ఉంది. ఈ కొండ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే భాస్కర పుష్కరిణి ఉంది. ఈ పుష్కరిణి అద్దంలా కనిపిస్తోంది. ఆ అద్దంలో కొండతో పాటు ఆలయం తమ ప్రతిబింబాలను చూసుకుంటున్నట్టుగా దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.



ఆకాశవాణి.. వార్తలు వింటున్నారా?



- నేడు అంతర్జాతీయ రేడియో దినోత్సవం
- ఒకప్పుడు ముఖ్యమైన వినోద సాధనం

కురుపాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి)

ఆకాశవాణి... విశాఖపట్నం కేంద్రం... వార్తలు చదువుతున్నది కందుకూరి సూర్యనారాయణ... ఎటువంటి సమాచార వ్యవస్థ లేని అప్పటి రోజుల్లో ఈ గొంతు వినిపిస్తే.. అక్కడ వాతావరణం నిశ్శబ్దంగా మారేది. ఎవరైనా శబ్దం చేస్తే.. ఎక్కడ ఏమాట విని పించకుండా పోతుందోనని శ్రోతలు అప్రమత్తంగా ఉండేవారు. కొన్ని గ్రామాలలో గ్రామచావిడులు... పంచాయతీ కార్యాలయాల వద్ద గుమిగూడేవారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలలో ఒక టి, రెండు పెద్దల ఇళ్లలో మాత్రమే రేడియోలు ఉండేవి. చిన్న సైజు పెట్టెల్లో ఉండే ఆ రేడియోలకు ఏంటెన్నాలు కూడా ఉండేవి. ఉదయాన్నే సుప్రభాతంతో ప్రారంభమయ్యే ఆకాశవాణి, విశాఖ పట్నం కేంద్రం కార్యక్రమాలు.. కథలు, నాటికలు, పాడి-పంట, సినిమాలు, పాటలు, హరి కథలు, వార్తలతో ప్రజలను ఎంతగానో అలరించేవి. ఉదయ రాగాలు పేరుతో ఉదయాన్నేసామాన్య కుటుంబాలలో జరిగే కార్యక్రమాలపై హాస్యభరితంగా ప్రసారమయ్యే కార్యక్రమం బహుళ ప్రజాదరణ పొందింది. ముఖ్యంగా ఆదివారం ఉదయం తెలుగు సినిమాలను సంక్షిప్తంగా ప్రసారం చేసేవారు. అది కూడా రెండు, మూడు భాగాలుగా. ఆ సినిమా డైలాగులు వినేందుకు శ్రోతలు ఎదురు చూసేవారు. వివిధ భారతిలో కొత్త సినిమాల పాటలు.. డైలాగులు వినిపించేవి.

వార్తలను క్రమం తప్పకుండా వినేవాళ్లం..

రేడియోలో వచ్చే ప్రాంతీయ వార్తలే మాకు ఆ రోజుల్లో బయట ప్రపంచం గూర్చి తెలియజేసేవని గృహిణి ఆకుల రమణమ్మ (85) చెప్పారు. మూడుసార్లు ప్రసారమయ్యే ప్రాంతీయ వార్తలను క్రమం తప్పకుండా ప్రశాంతంగా వినేవారమని చెప్పారు. అలాగే స్కైలాబ్ కూలిపోయిన సమయంలో సమాచారం కోసం అందరం రేడియోకు అతుక్కుపోయేవారమని చెప్పారు. సినిమాలు, నాటికలు, పాటలు వినడానికి వీధిలోని మహిళలంతా ఓచోట చేరే వారమని గుర్తు చేసుకున్నారు. తమ ఇంట్లో ఉన్న రేడియోకు ఆ రోజుల్లో లైసెన్స్ ఉండేదని.. ప్రతి నెలా పోస్టాఫీసులో పన్ను చెల్లించే వారమని చెప్పారు.

రేడియో దూరమాయే..

విజయనగరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కమ్మని కబుర్లు చెప్పే ఆత్మీయ నేస్తం.. సినిమా పాటలతో ఘైమరిపించే ఆనందవాణి.. ప్రపంచవ్యాప్తంగా జరిగే సంఘటనలను వార్తల రూపంలో అందించే ఆకాశవాణి... అదే రేడియో ఇప్పుడు కనిపించడం లేదు. ఉదయాన్నే సుప్రభాతంతో నిద్రలేపి.. సాయంత్రం జనరంజకంగా పలకరించి.. రాత్రి కమ్మని పాటలతో ఆహ్లాదపరిచే తొలి తరం సమాచార మాధ్యమం రేడియో. కానీ ఇప్పటి తరానికి దీని గురించి తెలిసింది అంతంతమాత్రమే. ప్రస్తుతం రేడియో వినియోగం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. కాకపోతే ప్రముఖ నగరాల్లో ఎఫ్ఎం రేడియోలు మాత్రం సందడి చేస్తున్నాయి. డిజిటల్, సోషల్ మీడియా దాటికి అన్నిరకాల మాధ్యమాలు పడిపోయాయి. రెడియోదీ అదే పరిస్థితి. అప్పట్లో ప్రతి ఇంట్లో రేడియోలు దర్శనమిచ్చేవి. కానీ ఇప్పుడు మచ్చుకైనా చూస్తామంటే దొరకడం లేదు. అప్పట్లో అత్తవారి లాంఛనాల్లో రేడియోకు కూడా స్థానం ఉండేది. కానీ ఆ ప్రసారాలపై ఇప్పుడు అంతగా ఎవరూ ఆసక్తి చూపుతుండడం లేదు.

పాడి-పంట కోసం వేచి ఉండేవారం..

ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ప్రతి రోజూ ప్రసారం చేసే పాడి-పంట కార్యక్రమం వినడానికి తమ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద వేచి ఉండే వాళ్లమని ఆవు అచ్చయ్య (90) తెలిపారు. అలాగే వాతావరణ వివరాలను చెవులు రిక్కించి వినే వాళ్లమని చెప్పారు. 1975-80 మధ్య కాలంలో మిడతల దండ్లు పొలాలపై దండెత్తిన సమయంలో రేడియోలో వచ్చే హెచ్చరికలపై ఆధారపడే వాళ్లమని అచ్చయ్య తెలిపారు.



ఆవు అచ్చయ్య

పైడిమాంబ ఆలయంలో చండీ హోమం



ప్రత్యేక అలంకరణలో పైడిమాంబ

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరుల తల్లి పైడిమాంబ ఆలయంలో బుధవారం చండీహోమాన్ని నిర్వహించారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని వనంగుడి, చదురు గుడుల్లో ప్రత్యేక హోమాలను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పైడిమాంబకు పుష్పాలంకరణ చేశారు. వివిధ రకాల పిండి వంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు.




పైడిమాంబ వనంగుడిలో హోమం చేస్తున్న దృశ్యం

ఓటు హక్కు వినియోగానికి గుర్తింపు కార్డు తప్పనిసరి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27న జరుగునున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్న ఉపాధ్యాయులు గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రానికి వెళ్లాలని తహసీల్దార్ బి.సుదర్శనరావు సూచించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, సర్వీస్ ఐడెంటిటీ కార్డు, విద్యాశాఖ జారీ చేసిన గుర్తింపు కార్డు, డిగ్రీ, డిప్లమో ఒరిజినల్ సర్టిఫికెట్‌లలో ఏదో ఒకటి తీసుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లాలన్నారు.

జీబీఎస్ కలకలం



- శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో అనుమానిత కేసు
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం
- గ్రామంలో పర్యటించిన డీఎంహెచ్‌వో
- ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్) అరుదైన వ్యాధి. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండల పరిధిలో పదేళ్ల బాలుడు ఈ వ్యాధి లక్షణాలతో ఇటీవల మరణించాడనే ప్రచారంతో... కలకలరం రేగుతోంది. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమై బుధవారం ఆ గ్రామంలో పర్యటించింది. బాలుడి తల్లిదండ్రులను ఆరా తీసింది. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేశారు. అయితే ఇది అంటు వ్యాధి కాదని, భయపడాల్సిన అవసరం లేదని దండుగోపాలపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.బి.సుధీర్ చెబుతున్నారు. కాపుగోదాయవలసలో వాతాడ యువంత్ (10) అనే బాలుడు ఈ వ్యాధితో మృతి చెందాడనే అనుమానంతో గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఇటువంటి వ్యాధి ఐదు లక్షల మందిలో ఒకరికి వస్తుందని తెలిపారు. శరీరంలో సోకిన ఇన్‌ఫెక్షన్ రోగిని కృంగదీస్తుందన్నారు. ముందుగా గొంతు నొప్పి, దగ్గు, డయేరియా, జ్వరంతో ప్రారంభమవుతుందని తెలిపారు. శరీర కణజాలాలను నిర్వీర్యం చేసి ఊపిరి ఆడకుండా చేస్తుందని తెలిపారు. దీనిపై గ్రామంలో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఇంకా ఎవరికైనా ఇటువంటి లక్షణాలు ఉన్నాయేమోననే విషయమై గ్రామంలో వైద్య సిబ్బందితో సర్వే చేశామని వివరించారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఇద్దరు చిన్నపిల్లల వైద్య నిపుణులు ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారని ఆయన తెలిపారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని సూచించామన్నారు. ఈ వ్యాధి సోకిందని గుర్తించడానికి మూడు రకాల వైద్య పరీక్షలు చేయాల్సి ఉందని వివరించా రు. ఒక్క రకం వైద్య పరీక్ష మాత్రమే చేసినందున యువంత్ ఈ వ్యాధితో మృతి చెందాడని నిర్ధారణకు రాలేకపోతున్నామన్నారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో వైద్య పరీక్షలు చేశామని వైద్యాధికారి సుధీర్ తెలిపారు.

ఏం చేయాలంటే...

కాలి వేళ్లలో తెలికపాటి జలదరింపు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. అత్యవసర సహాయం తీసుకోవాలి. ఈ వ్యాధి బారిన పడిన వారికి చికిత్సకు కొంత సమయం పడుతుంది. కోలుకోవడానికి నెలలు, సంవత్సరాలు పట్టవచ్చు. కొంతమందికి మూడేళ్లు పట్టవచ్చు. రోగ నిర్ధారణ జరిగిన ఆరు నెలల తరువాత దాదాపు 80శాతం మంది స్వతంత్రంగా నడవగలుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఏడాది తరువాత 60శాతం మంది కోలుకుంటున్నారని చెబుతున్నారు. 5 నుంచి 10శాతం మంది మాత్రమే అలస్యంగా కోలుకుంటున్నారని అంటున్నారు. చిన్నపిల్లలకు ఈ వ్యాధి అరుదుగా వస్తుంది. ఈ వ్యాధి సోకిన వారిలో పెద్దల కంటే పిల్లలు తొందరగానే కోలుకుంటున్నారని వైద్యవర్గాల మాట. ఒత్తిడిని తగ్గించుకోవడం, సంతులిత ఆహారం తీసుకోవడం, వ్యాయామం, జీవనశైలిలో మార్పులతో రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుచుకోవడం ద్వారా దీని భారిన పడకుండా ఉండొచ్చు.

నరాల పనితీరుపై ప్రభావం..

ఈ వ్యాధి వస్తే నరాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. నరాల బలహీనత, తిమ్మిర్లు, కొన్నిసార్లు పక్షవాతానికి కారణ మవుతుంది. చేతులు, కాళ్ల బలహీనమవుతాయి. ఈ వ్యాధి సోకడానికి గల కచ్చితమైన కారణాలను వైద్యులు గుర్తించలేక పోతున్నారు. మూడింట రెండొంతుల మందికి సంక్రమణ లక్షణాలు కనిపిస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇన్ఫెక్షన్, కొవిడ్-19 లక్షణాలైన గొంతు నొప్పి, జ్వరం, తలనొప్పి, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో పాటు ఊపిరితిత్తుల పైన ప్రభావం చూపుతుంది. జీర్ణాశయానికి సంబంధించిన ఇబ్బందులు తలెత్తుతాయి. తరచుగా కాళ్లు, పాదాల్లో జలదరింపు ఉంటుంది. శరీరం, చేతులకు వ్యాపిస్తుంది. నడవడం, బరువులు ఎత్తడం కష్టమవుతుంది. కొంతమందికి చేతులు, ముఖంలో ముందుగా ఈ లక్షణాలు కనిపిస్తాయి. చేతి వేళ్లు, కాలి వేళ్లు, చీలమండలు (మణికట్టు)లో సూదులతో గుచ్చినట్లు ఉంటుంది. శరీర మంతా బలహీనపడుతుంది. సరిగా నడవలేకపోవడంతో పా టు మెట్లు ఎక్కేందుకు ఇబ్బందులు పడతారు. మాట్లాడడం, నమలడం (మింగడం) వంటి పనులు చేయలేకపోవడం, ప్రేవుల పనితీరులో సమస్యలు, గుండె అత్యంత వేగంగా కొట్టుకోవడం, రక్తపోటులో తేడా (ఎక్కువ, తక్కువ) ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. సాధారణంగా లక్షణాలు కనిపించిన రెండు వారాల లోపే నిస్సత్తువ ఆవరిస్తుంది.

వెంటనే వైద్యులకు చూపించాలి..



జీబీఎస్‌తో పాదాల నుంచి చేతుల వరకు వణుకు వస్తుంది. నడవ లేరు. కూర్చోవడమూ కష్టమ వుతుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులకు చూపించాలి. నరాలపైన ప్రభావం చూపే వ్యాధి కావడంతో రోగ నిరోధక శక్తికి సంబంధించిన వైద్యం అందిస్తారు. ఈ వ్యాధి కారణంగా ఇన్‌ఫెక్షన్‌కు గురైన అవయవాలకు వైద్యం అందిస్తారు. ఎక్కువగా 20 నుంచి 40 సంవత్సరాల వయస్సులో ఉన్న వారు ఈ వ్యాధి బారిన పడుతున్నారు.

-డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, జనరల్ సర్జన్, ఎస్.కోట

కలిసి వస్తున్న ఫిబ్రవరి



గురండిలో బోర్లతో సాగు చేస్తున్న దృశ్యం

- రబీలో సాగుకు అనుకూలం
- దిగుబడులు ఆశాజనకం
- కూలీల కొరతతో ఇబ్బందులు
- పశ్చిమ బెంగాల్ కూలీలతో పనులు

భామిని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి)

వరి సాగు విషయంలో ఖరీఫ్ కంటే రబీపైనే అధిక శాతం రైతులు ఆసక్తి చూపుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలం గురండి, నేరడి, కాట్రగడ తదితర గ్రామాల్లో ఈ సీజన్‌లో వరి విస్తారంగా సాగవుతోంది. ఫిబ్రవరి నెల మొదటి వారంలో రబీ వరి సాగు పనులు మొదలవుతుంటాయి. దాదాపుగా మూడు దశాబ్దాల నుంచి ఖరీఫ్‌తో పాటు రబీలో సాగు అనుకూలంగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. విద్యుత్ అంతరాయం, పంట చేతికి అందే సమయంలో వర్షాలు కురిస్తే ఇబ్బంది తప్ప లేకుంటే ఈ సీజన్‌లో దిగుబడులు బాగుంటున్నాయని రైతులు చెబుతున్నారు. పురుగుపోటు, దోమపోటు, తెగుళ్లు కూడా తక్కువ ఉంటాయంటున్నారు. అత్యధిక శాతం బోరుబావుల పైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. గురండి, నేరడి, కాట్రగడ తదితర గ్రామాల్లో బోరుబావులు అధికంగా ఉన్నాయి. దీంతో వీటిపై ఆధారపడి సాగు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

కూలీల కొరతే అయినా...

రబీలో సాగుకూ కూలీల కొరత తప్పడం లేదు. దీంతో ఈ సీజన్‌లో కూడా అన్నదాతలు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యవసాయ కూలీలు అధిక శాతం వలస పోవడంతో రబీలో వరినాట్లు వేసేందుకు రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి వలస వచ్చిన కూలీలతో వరినాట్లు వేయగలుగుతున్నారు. వీరు అందుబాటులో ఉండడం కొంతవరకు కలసి వస్తోంది. దాదాపుగా ఆరేడు వందల ఎకరాలలో వరి సాగవుతోందని అంచనా వేస్తున్నారు. ఒకే ప్రాంతంలో వరిసాగు కావడంతో కనుచూపు మేర పచ్చదనంతో ఆహ్లాదంగా కనిపిస్తుంది. గుంటూరు తదితర ప్రాంతాల నుంచి అనువైన రకాల విత్తనాలు తెప్పిస్తున్నారు. కూలీల కొరత, వ్యవసాయేతర పనులకు సంబంధించి ట్రాక్టర్‌తో దున్నడం వంటి పనులు భారమవుతోంది. కానీ పంటపై నమ్మకంతో అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, సలహాలు, సూచనలు ఇస్తున్నారు. కానీ అన్నదాతలు మా త్రం వరి సాగుపైనే మక్కువ చూపుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఖరీఫ్‌లో ఎదురవుతున్న ఒడిదుడుకులే. ఎరువులకు ప్రస్తుతానికి ఇబ్బందులు లేవని... రానున్న రోజుల్లో అవసరానికి తగినంత మేర అందుబాటులో ఉంచాలని అధికారులను కోరుతున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి...

వరిసాగులో మొక్కకు మొక్కకు మధ్య 15 సెంటీమీటర్లు... వరుసల మధ్య 20 సెంటీమీటర్లు కంటే తక్కువ నీరు ఉండే విధంగా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం తెలిపారు. నాట్లు వేసే సమయంలో రెండు సెంటీమీటర్ల కంటే తక్కువ నీరు ఉండే విధంగా చూసుకోవాలని, ఒకచోట రెండు లేదా మూడు మొనలు ఉండే విధంగా నాట్లు వేసుకోవాలన్నారు. ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల దూరంతో కాలిబాటలు తీసుకోవడం వల్ల గాలి, వెలుతురు బాగా లభ్యమై తెగుళ్ల తాకిడి తక్కువ ఉండడమే కాకుండా ఆరోగ్యవంతమైన పంట పండించుకోవచ్చన్నారు.

ఆశించిన స్థాయిలో దిగుబడి..



ఖరీఫ్ కన్నా రబీలో వరి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తోంది. వ్యవసాయ ఖర్చులు కూడా కొంత తక్కువగా ఉంటాయి. ఈ పంటలతో వచ్చిన ఆదాయం ఖరీఫ్ సాగులో మదుపులకు ఉపయోగపడుతుంది. అప్పు చేయవలసిన అవసరం తగ్గుతుంది.

-గువ్వడ అప్పారావు, రైతు, గురండి

కూలీల కొరతతో కష్టం..



ఉపాధి హామీ పథకం వల్ల రైతులకు కూలీల కొరత ఏర్పడుతోంది. నాట్లు వేయడానికి ఇబ్బందిగా ఉంటోంది. పశ్చిమ బెంగాల్, బీహార్‌ల నుంచి వచ్చే వలస కూలీల వల్ల తాత్కాలికంగా సమస్య పరిష్కారమవుతోంది. యంత్రాలతో నూర్పులు చేయడం రైతులకు అనుకూలంగా ఉంది.

-జగ్గుసెట్టి గిరిబాబు, రైతు, నేరడి



గురండిలో పురుషులే నాట్లు వేస్తున్న దృశ్యం

అధ్వాన రోడ్లతో అవస్థలు



విజయనగరం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలంలోని రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఐదేళ్ల వైసీపీ హయాంలో రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సైతం గ్రామీణ రోడ్లపై దృష్టి సారించకపోవడంతో దాదాపు పది గ్రామాల్లో ప్రధాన రోడ్లు, లింకు రోడ్లు గోతులమయంగా మారాయి. నగరంలోని గుంకలాం, దుప్పాడ, ద్వారాపూడి, చిల్లపేట, రాకోడు, పినవేమలి తదితర ప్రాంతాల్లోని రోడ్లు దారుణంగా ఉన్నాయి. దుప్పాడ నుంచి దుప్పాడ బీసీ కాలనీ రోడ్డు పరిస్థితి ఘోరంగా వుంది. దుప్పాడ నుంచి చిల్లపేట రహదారి నిర్మాణం జరగకపోవడంతో రోడ్డుపై రాళ్లు తేలిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

దుప్పాడ నుంచి చిల్లపేట వెళ్లే రహదారి దుస్థితి



అయ్యన్నపేట నుంచి దుప్పాడ బీసీ కాలనీ వెళ్లే రహదారి

నేడు నీటి సరఫరా బంద్

రాజాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజాం పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డులకు గురువారం తాగునీటి సరఫరా బంద్ చేయనున్నామని కమిషనర్ జె.రామప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ రోడ్డులో మెయిన్ తాగునీటి పైపు లైన్, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ పాడైనందున మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

సేద్యం పరికరాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గజపతినగరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, తుంపర సేద్యానికి అవసరమైన పరికరాల కోసం రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి గోవిందమ్మ అన్నారు. బుధవారం మండలంలోని కొనిస గ్రామంలో రబీలో పంటలపై రైతులకు పలు సూచనలిచ్చారు. సాగు చేసే పంటల వివరాలను రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో ధనలక్ష్మి, వీఏవో భార్గవి పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోండి

రేగిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సంకిలి పీఏసీఎస్ ద్వారా తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో రెన్యువల్ చేయకపోతే 13 శాతం అపరాధ వడ్డీ తప్పదని పీఏసీఎస్ సీఈవో జి.రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఈ సొసైటీ పరిధిలోని 13 గ్రామాల రైతులు ఫిబ్రవరి నెలాఖరి సరికి చెల్లించాలన్నారు. రుణాలను రెన్యువల్ చేయాలనే రైతులు 1-బి, అడంగల్, ఆధార్ కార్డుతో సొసైటీ కార్యా లయాన్ని సంప్రదించాలన్నారు.

వసతులు కల్పించండి

శృంగవరపుకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోనని గిరిజనులకు అన్ని సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ కోరారు. బుధవారం తహసీల్దార్ అరుణకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో గిరిజన సంఘ నాయకులు గౌరీశ్, అరుణ్, రాము, సన్యాసిరావు ఉన్నారు.

రాముకు పురస్కారం

రాజాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆగూరు గ్రామానికి చెందిన రంగస్థల నటుడు సత్యవరపు రాముకు ప్రముఖ సినీ నటుడు రావి కొండలరావు పురస్కారం లభించింది. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరిలో రామును రేలింగి నరసింహరావు, కాకినాడ రమణ ఘనంగా సత్కరించి రూ.25 వేలు నగదు పురస్కారం అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

జామి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ-అన్నంరాజుపేట గ్రామాల మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డుపై గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో ఈ వ్యక్తి బిక్షాటన చేస్తుంటాడని తెలిసిందన్నారు. ఎవరికైనా ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే జామి పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

గరివిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలలో మూడోరోజు బుధవారం క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కబడ్డీ, ఖోఖో పోటీలతో పాటు వివిధ నృత్యాల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను చాటారు.

భూఆధార్ తప్పనిసరి

రేగిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతుకు భూ ఆధార్ తప్పనిసరి అని ఏవో మురళీకృష్ణ అన్నారు. ఉదవారం మండలంలో కొమిర, లక్ష్మీపురం గ్రామాల్లో ఆయన పర్యటించారు. భూ ఆధార్‌పై అవగాహన కల్పించారు. సచివాలయాన్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

రేపటినుంచి ఆలయ ప్రారంభోత్సవాలు

కొత్తవలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలింగపురంలో ఉమా రామలింగేశ్వర ఆలయ ప్రారంభోత్సవాలను ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వాహించనున్నట్టు పండితులు అంపోలు ఉమామహేశ్వరశర్మ, కొల్లూరు శ్రీధర్‌శర్మ తెలిపారు. శుక్రవారం విఘ్నేశ్వరపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి వినతి



ఎమ్మెల్యేతో కల్లేపల్లి యాత కులస్థులు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోట మండలానికి చెందిన కల్లేపల్లి లో యాత కులస్థుల కోసం సామాజిక భవనం నిర్మించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి బుధవారం ఆమె నివాసంలో స్థానికులు వినతిపత్రం అందజేశారు. సామాజిక భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలో భవన నిర్మాణానికి చర్యలు చేపడతానని హమీ ఇచ్చారు.

గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

లక్కవరపుకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై-యూడీఏ, ఎన్టీఆర్ గృహ పథకానికి అర్హులు త్వరగా దరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సూచించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్.కోట మండల పార్టీ నాయకుడు జీఎస్ఏ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

పంచ సూత్రాలు పాటించండి

చీపురుపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) స్వయం సహాయక సంఘాలు పంచ సూత్రాలు పాటించేలా మండల సమాఖ్య సభ్యులు కృషి చేయాలని వెలుగు బ్యాంకు లింకేజీ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ కోరారు. చీపురుపల్లిలో బుధవారం జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్గత రుణాలు మంజూరు, సంఘ నిధి పెంపుదల, ఆదర్శ సంఘాలను తయారు చేయడం వంటి విషయాలపై సమాఖ్య సభ్యులు దృష్టి పెట్టాలన్నారు.ఏపీడీ కె.సావిత్రి, ఏసీ బి.బంగారమ్మ, ఏపీవో ఎన్.అప్పలనాయుడు, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.నాగమణి ఉన్నారు.

సత్యేంద్రదాస్ మృతికి సంతాపం

కొత్తవలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్రదాస్ మృతిపై మండలంలోని మంగళపాలెం గ్రామానికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ రాపర్తి జగదీశ్‌బాబు సంతాపం వ్యక్తం చేశారు. ప్రధాన అర్చకుడి హోదాలో మంగళపాలెంలో నిర్మించిన శ్రీరామాలయాన్ని ఆయన ప్రారంభించారన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కుంభాభిషేకం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారని గుర్తు చేసుకున్నారు.

సమన్వయంతో పనిచేయండి

వేపాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ సమైక్యల వీవోఏలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు సూచించారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం వీవోఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఏపీఎం సూర్యనారాయణ, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, సబల ప్రాజెక్టు సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస పింఛన్ రూ.9 వేలకు పెంచాలి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస పింఛన్ రూ.9 వేలకు పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ పలు వామపక్ష సంఘాల నాయకులు స్థానిక పోస్టాఫీస్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీ ఎం నాయకులు మొయిద పాపారావు, కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ పింఛను పెంపుదల విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వృద్ధ కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకుడు కాళ్ల అప్పలసూరి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కనకల పద్మనాభం, ఎస్.సత్యనారాయణ, ఎం.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో పూర్ణాహుతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామివారి దేవస్థానంలో సుదర్శనస్వామి వారిని పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. ఏటా భీష్మఏకాదశి నాడు సీతారాముల తిరుక్కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించడంతో కల్యాణోత్సవం జరిగిన నాలుగోరోజున నవవధూవరులైన సీతారాములకు రథయాత్ర నిర్వహించడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో రథయాత్ర మరుసటి రోజున ఉదయం యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు.

అద్దె బకాయి దుకాణాలకు తాళాలు

విజయనగరం రింగురోడ్డు ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దీర్ఘకాలికంగా అద్దె బకాయిలు ఉన్న ఏడు దుకాణాలకు బుధవారం మున్సిపల్ రెవెన్యూ అధికారులు తాళాలు వేశారు. నోటీసులు జారీ చేసినా వారు స్పందించకపోవడంతో తాళాలు వేశామని అధికారులు తెలిపారు.

వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడండి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మాపురం, ఒమ్మి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడీ పద్మజ బుధవారం పరిశీలించా రు. వేతనం గిట్టుబాటు అయ్యేలా పనిచేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో అరుణకుమారి, టెక్నికల్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

పశువైద్య శిబిరం తనిఖీ

మెరకముడిదాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాంలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వైవీ రమణ పరి శీలించారు.స్థానిక పశు వైద్యాధి పద్మావతికి పలు సూచనలు చేశారు.

నైపుణ్యాభివృద్ధికి అవగాహన ఒప్పందం

డెంకాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచడమే లక్ష్యంగా స్థానిక ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల, భువనేశ్వర్‌కు చెందిన సెంట్రల్ టూల్ రూమ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (సీటీటీసీ)తో బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యం సన్నద్ధత, పరిశ్రమ ఆధారిత నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, సాంకేతిక నిపుణులతో శిక్షణ అందించడమే అవగాహన ఒప్పందం ముఖ్య ఉద్దేశం. ఈ అవగాహన ఒప్పందం ఎంవీజీఆర్ కళాశాల ఫ్యాకల్టీని సీటీటీసీ సౌకర్యాల వద్ద అత్యాధునిక పరిశోధన, అభివృద్ధిలో నిమగ్నం, ఫ్యాకల్టీ రీసెర్చ్ సబ్జెక్ట్ కూడా సులభతరం చేయనుంది. ఈ భాగస్వామ్యంలో పోటీ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం, పేటెంట్ దాఖలు ప్రక్రియలో ఎంవీజీఆర్ కళాశాల అధ్యాపకులకు సహాయం చేయడం, ఆవిష్కరణలు, వ్యవస్థాపకతను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుంది. అవగాహన ఒప్పందంపై రెండు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఒప్పందాలపై ఎంవీజీఆర్ కళాశాల డైరెక్టర్ పి.ఎస్.సీతారామరాజు, సీటీటీసీకి సీనియర్ ఇంజనీర్, ఏఐ విభాగం హెడ్ డి.రీతు మైతీ సంతకాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.రమేష్, మెకానికల్ విభాగం హెచ్‌వోడీ డా.ఎన్.రవికుమార్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రామతీర్థంలో గానాలాపన



కీర్తనలను ఆలపిస్తున్న గాయకులు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారాముల కళ్యాణోత్సవం, రథయాత్ర కార్యక్రమాలు ఘనంగా ముగిసిన సందర్భంగా విజయనగరానికి చెందిన ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలుపద్మప్రియ ఆధ్వర్యంలో బుధవారం భావయామి రఘురామ్ ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాముడిని స్తుతిస్తూ గానాలాపన చేశారు. కె.భానుహర్ష వయోలిన్, ఎం.వి.కామేశ్వరరావు ఫ్లూట్, డాక్టర్ మండపాక రవి, కె.మహేశ్వరరావు మృదంగ సహకారం అందించారు. అంతకు ముందు పండిత సదస్సు జరిగింది.

చంద్రంపేటలో రీసర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో కీర్తి

గంట్యాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రంపేటలో జరుగుతున్న భూముల రీసర్వేను ఆర్డీవో దాట్ల కీర్తి బుధవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఎక్కడా లోపాలు లేకుండా సర్వే చేయాలని సిబ్బందిన ఆదేశించారు. హద్దులు గర్తించే సమయంలో ఖచ్చితమైన నిబంధనలు పాటించాలన్నారు. ఆమెతో పాటు తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి ఉన్నారు.

మానసిక సమస్యలపై అవగాహన

నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పీహెచ్‌వైద్యాధికారి డాక్టర్ సాయిరామ్ ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ జరిగింది. కార్యక్రమంలో జిల్లా క్లినికల్ సైకాలజిస్టు రాజు పిల్లలకు మానసిక సమస్యలు, లక్షణాలు, పరిష్కార చర్యలపై అవగాహన కల్పించారు. టైమ్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌లను వివరించారు. జ్ఞాపకశక్తి సమస్యలు, పరీక్షల భయం, ఒత్తిడి, ఒంటరి తనం తదితర సమస్యలను ఎలా అధిగమించాలో తెలిపారు. మానసిక సమస్యలతో బాధపడితే వారు 14416 నంబరుకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సైక్రియాట్రిక్ నర్సు పి.మంగమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

దత్తిరాజేరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడసాం జడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది టెన్త్ ఫలితాల్లో 61 మంది విద్యార్థులకు గానూ 21 మంది 500లకు పైబడి మార్కులు సాధించడంతో పాటు, శతశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను డీపీఆర్‌టీయూ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను బుధవారం సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం గనివాడ రామ్మూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంది వెంకటరమణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇనుముల నారాయణప్పడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్.బలరాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్‌సీఈఆర్‌టీ సూచనలతో రూపొందించిన మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు.

చెరువుల్లోకి చేప పిల్లల విడుదల



చేపలు వదులుతున్న డీడీ నిర్మలకుమారి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య సంపద పథకంలో భాగంగా మత్స్య శాఖ డీడీ నిర్మలకుమారి వివిధ చెరువుల్లో బు .దవారం 1.30 లక్షల ఫింగర్ సైజ్ చేప పిల్లలను వదిలారు. విజయనగరం డివి జన్ పరిధిలోని 11 డిపార్టుమెంటల్ చెరువుల్లో పిల్లలను విడచిపెట్టారు.

పొదుపు పథకాలపై ప్రచారం చేయండి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ ద్వారా అమలవుతున్న పొదుపు పథకాల కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని విజయనగరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ అన్నారు. నెల్లిమర్లలోని సబ్ పోస్టాఫీస్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18, 19 తేదీల్లో జరుగనున్న ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ డ్రైవ్‌లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ నెల్లిమర్ల ఎస్‌పీఎం జి.ఎర్రయ్య ఉన్నారు.

పదోరోజుకు చేరిన విద్యార్థుల నిరసన

గరివిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని పశు వైద్య కళాశాల విద్యార్థుల నిరసన బుధవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. వీసీఐ అనుమతి పొందాలని, స్టైఫండ్‌ను పెంచాలని, కళాశాలలో పూర్తిస్థాయి అధ్యాపకులను నియమించాలని, అసంపూర్తి భవన నిర్మాణాలు పూర్తిచేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

ఘనంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరుగాంచిన పుణ్యగిరి ఉమాకోటీ లింగేశ్వరస్వామికి వార్షిక కల్యాణోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు లట్టాల మణిశర్మ, సంతోష్‌శర్మ.. స్వామివారికి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ధర్మరాజు ప్రతిష్టించిన శివలింగానికి లక్ష బిల్వార్చన చేశారు. ఆలయ ఈవో నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

కర్రతో దాడి చేసి.. బావిలో తోసేసి..

● రైతుపై హత్యాయత్నం



గాయపడిన రైతు వెంకటరావు

జామి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండలో దారుణం చోటు చేసుకుంది. పెసర చేను దొంగతనానికి వెళ్లిన వ్యక్తి అక్కడ కాపలా కాస్తున్న వ్యక్తి అడ్డుపడటంతో దాడికి తెగబడ్డాడు. అంతటితో వదలకుండా అతడిని ఎత్తుకుని వెళ్లి బావిలో పడేశాడు. ఆపై బండ రాళ్లను అతడిపై వేశాడు. రైతు చనిపోయాడనుకుని సదురు వ్యక్తి వెళ్లిపోయాడు. అయితే అదృష్టం కొద్దీ ఆ రైతు ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానిక రైతుల సాయంతో విజయనగరంలోని మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అలమండ గ్రామానికి చెందిన పి.వెంకటరావు తన పెసర చేనుకు కాపాలాకు మంగళవారం రాత్రి వెళ్లాడు. అర్ధరాత్రి ఒంటి గంటన్నర సమయంలో అలికిడి కావడంతో వెళ్లిచూడగా గ్రామానికి చెందిన ఎర్నాయుడు పెసర పంటను కోసి మోపు కడుతుండగా అడ్డుకున్నాడు. దీంతో దొంగతనానికి వచ్చిన ఎర్నాయుడు తన చేతిలో కర్రతో వెంకటరావుపై దాడి చేశారు. గాయపడ్డ అతడిని సమీపం లోని బావిలోకి పడేసి చంపేందుకు బండరాళ్లు వేశాడు. రైతు చనిపోయాడని భావించి అక్కడ నుంచి వెళ్లి పోయాడు. అయితే వేకువజాము సమయంలో బావిలో నుంచి కేకలు వే యడంతో సమీపంలోని రైతులు పరుగున వచ్చి బయటకు తీశారు. వెంటనే అలమండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ వీరజనార్దన్ మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిను పట్టుకు నేందుకు రెండు బృందాలు గాలిస్తున్నాయన్నారు.

తండ్రిని వైద్యానికి తీసుకెళ్లి.. కొడుకు మృతి

మెరకముడిదాం/ రాజాం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తండ్రి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లిన కొడుకు అనంత లోకాల కు చేరుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెరకముడిదాం మండలంలోని ఎం.రామయ్య వలసకు చెందిన మజ్జి రమణ(35) విశాఖలో కూలి పనులు చేస్తూ కుటుబాన్ని పోషిస్తున్నాడు. తన తండ్రి సీతయ్య అనారోగ్యం పాలవ్వడంతో మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సొంతూరు వచ్చారు. రాజాం పట్టణం లోకి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తండ్రిని మంగళవారం తీసుకెళ్లాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి ఆసుపత్రి నుంచి బయలుదేరిన రమణ.. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని మురుగునీటి కాలువలో పడి మృతి చెందాడు. బుధవారం ఆసుపత్రికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆరా తీశారు. ఈ క్రమంలో మురుగునీటి కాలువలో పడి మృతి చెందిన వ్యక్తి రమణగా రాజాం పోలీ సులు గుర్తించారు. మద్యం మత్తులో కాల్వలో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఈ ఘటనపై రాజాం పోలీసులు కేసు నమోదు చేశారు

మరువాడలో వ్యక్తి ఆత్మహత్య

వంగర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరువాడలో మెరకముడిదాం మండల కేంద్రానికి చెందిన వసాది శ్రీరాములు (52) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తోడల్లుడు గ్రామమైన చౌదివలస చుట్టరికానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో సమీప గ్రామం మరువాడలో మద్యం తాగి వేగావతి తీరంలోని టేకు చెట్టుకు తన లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శవ పంచనామా ముగించి పోస్టుమార్టానికి రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చెట్టుపై నుంచి జారిపడి గిరిజనుడి మృతి

కొమరాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవుకోన గ్రామానికి చెందిన కేలే నారాయణరావు(40) చెట్టుపై నుంచి జారిపడి మృతి చెంది నట్లు ఎస్ఐ నీలకంఠం బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇ లా ఉన్నాయి. మంగళవారం ఉదయం నారాయణరావు.. మేకల మేత కోసమని ఇంటి వెనుక గల చెట్టు ఎక్కి కొమ్మలు కొస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అయితే ఆస్పత్రికి తరలించేలోపు మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గడ్డిమందు తాగి..

వీరఘట్టం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం గ్రామానికి చెందిన చోడవరపు లక్ష్మణరావు(38) గడ్డిమందు తాగి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్ఐ జి.కళానిధి బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మణరావు కొన్ని సంవత్సరాలుగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. వ్యాధి తగ్గక పోవడంతో మనస్తాపం చెందిన లక్ష్మణరావు మంగళవారం ఉదయం గడ్డిమందు తాగాడు. గుర్తించిన భార్య చోడవరపు దేవి స్థానిక పీహెచ్‌సీకి తరలించింది. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మంగళవారం రాత్రి మృతి చెందాడు. దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అరెస్టు

బాడంగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జె.తారకేశ్వరరావు తెలిపారు. ఆయన బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది డిసెంబరు 27న మండలంలోని రేజరు గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్టు స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు బా లిక కోసం గాలించారు. బాలిక ఆచూకీని గుర్తించారు. బాలికపై వాడాడ గ్రామానికి చెందిన వాడాడ వెంకటరమణ లైంగిక దాడి చేసిన ఆరోపణలతో అతడిపై కేసు నమోదు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు.

56 మందికి నేత్ర పరీక్షలు

గరివిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండలక్ష్మీపురంలో బుధవారం ఉచితం నేత్ర వైద్య శిబిరం ఏర్పాటైంది. మానవీయత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యబృందం పరీక్షలు నిర్వహించింది. సర్పంచ్ కామేశ్ శిబిరాన్ని పర్య వేక్షించారు. 56 మందికి పరీక్షలు చేయగా, అందులో 29 మందిని శస్త్రచికిత్సల నిమి త్తం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. శిబిరంలో గ్రామ కార్యదర్శి కంది వెంకటరమణ, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోమలి, మేనేజర్ పి.సురేష్ పాల్గొన్నారు.

చొరవ చూపుతారా.. వివాదం పరిష్కరిస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

ఒడిశా బీడీవో అడ్డుకున్నారు. విద్యుత్ మీటర్లు వేయడానికి వెళ్లిన ఏపీఈపీడీసీఎల్‌ను సిబ్బందిని, పింఛన్లు పంపిణీకి వెళ్లిన వారిని కూడా అడ్డుకున్న సంఘటనలున్నాయి. వెలుగు ఏపీడీని సైతం అడ్డుకున్నారు. గతంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్ కొఠియా గ్రామానికి వెళ్లడానికి ప్రయత్నించి ధూళిభద్ర నుంచే వెనుదిరిగాల్సి వచ్చింది.

● పరిషత్ ఎన్నికల సమయంలో ఒడిశా ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ వివాదాన్ని రెండు రాష్ట్రాలు చర్చలు జరుపుకుని సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. అయితే ఆ తర్వాత ఇరు రాష్ట్రాల సీఎంలు నవీన్ పట్నాయక్, జగన్‌లు సమావేశమైనా వివాదం పరిష్కారం కాలేదు. నేటికీ మూడేళ్లవుతున్నా.. ఆ దిశగా అడు గులు పడలేదు. ఒడిశా తీరులో కూడా మార్పు రాలేదు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం: మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కొఠియాలో ఒడిశా దూకుడుకు కారణమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం స్థానిక విలేఖర్లతో ఆమె ఫోన్‌లో మాట్లాడుతూ.. నాటి సీఎం జగన్ కొఠియా గ్రామాల సమస్యను పట్టించుకోలేదన్నారు. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేసుల నుంచి కాపాడాలని కేంద్రాన్ని కోరడం తప్ప మరేమీ చేయలేదని విమర్శించారు. అయితే ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో తాను కొఠియా సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సంయమనం పాటించాలి

కొఠియా గ్రూప్ గ్రామాల విషయమై ఒడిశా సంయమనంతో వ్యవహరించాలి. ఏపీ అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదు. ఈ గ్రామాల విషయమై ఉన్న స్టేటస్ కో ను గౌరవించాలి.

- గెమ్మల డోంబు, దిగువ కొఠియా

సామరస్యంగా వ్యవహరించాలి

కొఠియా వివాదంపై ఏపీ ఎంతో సామరస్యంగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి పాటు పడుతుంది. రూ.4వేలు పింఛన్, ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. ఇళ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తోంది. ఒడిశా సామరస్య పూర్వకంగా ఉండాలి. ఏపీ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు.

- సీదరపు చుక్క, పట్టుచెన్నారు

17న నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక

పాలకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అధ్యక్ష ఎన్నిక ఈనెల 17న నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. తొలుత ఈనెల 3న ఎన్నిక నిర్వహించాలని నిర్ణయించినా జరగలేదు. మొత్తం 19 మంది కౌన్సిలర్లలో వైసీపీకి 14 మంది సభ్యులు ఉండగా, కూటమిలో ఐదుగురు ఉన్నారు. ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఓటు హక్కు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఉండడంతో కూటమికి ఆరుగురు సభ్యులు ఉన్నట్టు తెలింది. వైసీపీకి సంఖ్యా బలం ఉన్నా అధ్యక్ష స్థానానికి ఎస్సీ రిజర్వ్‌డ్ అభ్యర్థి లేరు. రెండో వార్డు కౌన్సిలర్ ఆకుల మల్లేశ్వరి అధ్యక్ష స్థానానికి అర్హురాలైనప్పటి ఈమె ఇటీవల టీడీపీలో చేరారు. కూటమికి మరో నలుగురు సభ్యుల అవసరం ఉంది. నగర పంచాయతీ అధ్య ఎన్నికకు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్ పాటు ఎమ్మెల్యే జయకృష్ణ ప్రతిష్ఠాత్మకంగా ముందుకు వెళుతున్నారు.

కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని నాక్ (నేషనల్ అకాడమిక్ ఎక్రిడేషన్ కౌన్సిల్) చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్తవలసలో గల శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఆయనతో పాటు సభ్యులు చంద్రకాంత్, సుభాష్‌లకు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ చలపతిరావు, అధ్యాపకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అలాగే ఎన్‌సీసీ విద్యార్థులు గౌరవ వందనం చేశారు. కళాశాల అభివృద్ధిపై ప్రిన్సిపాల్ వివరించారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతి నిధుల సహకారంతో పట్టణాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నూతన మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బాధ్యత లు చేపట్టిన ఆయనకు మేనేజర్ జి.లక్ష్మి, డీఈ శ్రీనివాసరాజు, అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పట్టణాభివృద్ధికి సమిష్టిగా బాధ్యతలను పంచుకోవాలని అన్నారు. ఈయన కృష్ణ జిల్లా కొండపల్లి గ్రేడ్-3 మున్సిపాల్టీ నుంచి పార్వతీపురం మున్సిపాల్టీకి ఓన్ పే కమిషనర్‌గా ఇక్కడకు వచ్చారు.


ఎమ్మెల్యేతోనే నియోజకవర్గ అభివృద్ధి

బెలగాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వల్లే నియోజవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని టీడీపీ కొప్పుల వెలమ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తూ ఉంటే.. కొన్ని దినపత్రికల్లో అవాస్తవాలు రాస్తున్నారని అన్నారు. వారికి తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు బి.సీతారాం, పార్టీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు, రౌతు పెంకి వేణుగోపాల్‌నాయుడు, బోను చంద్రమౌళి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుంట్రెడ్డి రవి, కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, బడే గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సదుపాయం కల్పించండి

సాలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించాలని కళాశాల అధ్యాపక బృందం మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. ఈమేరకు బుధవారం సాలూరులోని తన నివాసంలో మంత్రిని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి గాను కళాశాల ప్రవేశాలకు ప్రచారం చేసే క్రమంలో చుట్టుప్రక్కల ఉన్న గిరిజన గ్రామాల్లో ప్రజలు కళాశాలలో చేర్పించుటకు సుముఖత వ్యక్తం చేస్తున్నారని అన్నారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా హాస్టల్ సదుపాయం ఉంటేనే కళాశాలలో చేర్పిస్తామని చెబుతున్నారని మంత్రికి తెలిపారు. కళాశాలలో హాస్టల్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.

వైభవంగా చక్రతీర్థ స్నానం



స్వామివారికి చక్రతీర్థ స్నానం నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తోటపల్లిలో స్వామివారికి బుధవారం వైభవంగా శ్రీచక్ర తీర్థ స్నానాలను నిర్వహించారు. వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో ముందుగా ఆలయ ప్రధాన అర్చకుడు వీవీ అప్పలాచార్యు లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన దేవస్థానాల ప్రాంగణం నుంచి మంగళ వాయిద్యాలతో అమ్మవార్లను ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా నాగావళి నదీ తీర ప్రాంతానికి తరలించారు. నదీ ప్రాంతంలో శ్రీచూర్ణోత్సవంతో పాటు పలు రకాల అభిషేకాలను నిర్వహించారు. అనంతరం పవిత్ర నాగావళి నదీ తీరంలో శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్ర తీర్థ స్నానాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విరిగిన తలుపులు.. చెదలు పట్టిన కిటికీలు

- శిథిలావస్థలో వంగర గ్రంథాలయం
- పోటీ పరీక్షల పుస్తకాలు లేని వైనం
- ఇబ్బంది పడుతున్న పాఠకులు



కిటికీలకు చెదలు పట్టిన దృశ్యం



శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయం

వంగర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయం అధ్వానంగా దర్శనమిస్తోంది. భవనం తలుపులు విరిగిపోయాయి. కిటికీలు చెదలు పట్టి పాడయ్యాయి. దశాబ్దం కిందట నిర్మించిన ఈ భవనం కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఈ గ్రంథాలయం ప్రధాన వీధిలో ఉండటంతో అధిక సంఖ్యలో పాఠకులు వస్తుంటారు. కానీ ఇక్కడ ఒకటి రెండు దినపత్రికలు తప్పా పుస్తకాలు ఏవీ లేకపోవటంతో వీరు ఊసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మండలంలోని 27 పంచాయతీల నుంచి ఇంటి పన్నుల రూపంలో రూ.2కోట్లు వసూలు అవుతోంది. ఇందులో గ్రంథాలయ సెస్ కింద 8 శాతం అంటే సుమారు రూ.16లక్షలు మండల నిధులకు జమ అవుతాయి. అయినా గ్రంథాలయానికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ఇప్పటికైనా గ్రంథాలయానికి మరమ్మతులు చేపట్టి, పత్రికలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్‌వో భాస్కరరావు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు సూచించారు. తాడికొండ పీహెచ్‌సీని ఆయన బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ రక్తహీనత ఉన్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రక్తహీనత తగ్గించడానికి కావాల్సిన పోషకాహార కిట్లును అందించారు. వీరికి రక్త పరీక్షలు చేసి, హెచ్‌పీ శాతం పెరిగింది లేనిదీ ఎప్పటికప్పుడు చూడాలని ఆయన సూచించారు. ఆయన వెంట వైద్యుడు బుద్దేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఏపీఈఈయూ వార్షికోత్సవం

బొబ్బిలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104)కి 75 వసంతాలు పూర్తవడంతో బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ప్రాంతీయ అధ్యక్షుడు వంగపండు లక్ష్మణ, బొబ్బిలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు భోగి సూరి, గేదెల దేముడు తదితరులు పాల్గొన్నారు.

● పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఐకమత్యమే తమ బలమని ఏపీఈఈ(1102) యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీధర్‌లు అన్నారు. బుధవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1102 యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పట్టణంలోని నిరాశ్రయుల వసతి గృహం, జట్టు ఆశ్రమాలకు బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులను అందజేశారు. యూనియన్ సహాయ కార్యదర్శులు సత్యనారాయణ, వీవీ నారాయణ, రీజనల్ ఉపాధ్యక్షులు ప్రవీణ్, పి.రాములు పాల్గొన్నారు.

పోలమాంబ మూడో వారం జాతర ఆదాయం రూ.8లక్షల 79వేలు

మక్కువ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ అమ్మవారి మూడో వారం జాతర ఆదాయం రూ.8లక్షల 79వేల 807 వచ్చినట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శీఘ్ర దర్శనం రూ.100ల టికెట్ల ద్వారా రూ.3లక్షల 61వేల 700, ప్రత్యేక దర్శనం రూ.20ల టిక్కెట్ల ద్వారా రూ.లక్ష 5వేలు, కేశఖండన ద్వారా రూ.14,600, మహాన్నదాన విరాళాల ద్వారా రూ.లక్షా82వేల307, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.లక్షా 29వేల 420, పులిహోరా ప్రసాదం ద్వారా రూ.86,760 ఆదాయంతో కలిపి మొత్తం రూ.8 లక్షల 79 వేల 807 వచ్చినట్టు ఆయన వివరించారు.

జంపరకోట ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి



జంపరకోట వద్ద నిరసన చేస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జంపరకోట ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. జంపరకోట గ్రామంలోని ప్రాజెక్టును ఆయన బుధవారం సందర్శించారు. మండలంలో గిరిజన రైతులకు చెందిన నాలుగు పంచాయతీల పరిధిలో 2,100 ఎకరాల్లో సంవత్సరానికి రెండు పంటలు పండించడానికి సాగునీరు అందించడానికి జంపరకోట ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయన వెంట జంపరకోట సర్పంచ్ ఆరిక నారాయణరావు, సంఘం జిల్లా నాయకులు ద్వారపూడి అప్పలనాయుడు, పొట్నూరు శంకరరావు, లక్ష్మణరావు, మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న పెట్రోలు దొంగలు

బొబ్బిలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పెట్రోలు దొంగలు రెచ్చిపోతున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు నివసించే ప్రాంతా లను ఎంచుకుని ఆరుబయట రోడ్లపైన, వారి ఇళ్ల ముం దు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల నుంచి చాకచ క్యంగా పెట్రోలును తస్కరిస్తున్నారు. స్థానిక ఆర్టీసీ కాం ప్లెక్స్ సమీపంలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాల సమీ పంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత బైకుల నుంచి పెట్రోలును గుర్తుతెలియని యువకుడు దొంగిలి స్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. నాయుడు కాలనీ, మెహర్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, గొల్లపల్లి దాడి తల్లి కాలనీ, అప్పయ్యపేట కాలనీ ప్రాంతాలలో తరచూ ఈ తరహా పెట్రోలు దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు గత కొంతకాలంగా ఫిర్యాదు చేస్తున్నారు. పోలీసులు రాత్రివేళల్లో గస్తీని ముమ్మరం చేసి వీరి ఆట కట్టించాలని పలువురు కోరుతున్నారు.

హత్య కేసుపై దర్యాప్తు

బొబ్బిలి/తెర్లాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెర్లాం మండలం నెమలాం గ్రామంలో ఈనెల 10వ తేదీ రాత్రి జరిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కోనారి ప్రసాద్ హత్య కేసుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి ఆధ్వర్యంలో బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్‌ఐ సాగర్‌బాబు ఇతర ఐడీ పార్టీ బృందాలు తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. హతుని ఫోన్‌కాల్స్ ఆధారంగా నిందితుల ఆచూకీని కనుగొనేందుకు అన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రసాద్ స్నేహితులను, బంధువులను ఇతర వ్యక్తులను విచారిస్తున్నారు. ప్రసాద్ హత్య జరిగిన ప్రదేశాన్ని డీఎస్పీ భవ్యారెడ్డి బుధవారం రాత్రి వెళ్లి పరిశీలించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురిని విచారించారు. కేసు దర్యాప్తునకు సంబంధించి సీఐ నారాయణరావు ఆమెకు వివరించారు. ఈ ప్రాంతానికి చెందిన వారే ప్రసాద్‌ను హతమార్చారన్న అనుమానాలు బలపడుతున్నాయి.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

సాలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లారీ కార్మికుడు కొడుకు జేఈఈ మెయిన్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచాడు. డబ్బివీధిలో నివాసం ఉంటున్న లారీ కార్మికుడు రౌతు రాజా, వరలక్ష్మిల కొడుకు రౌతు షణ్ముకేశ్వరరావు జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.68 శాతంతో ఆల్‌ఇండియాలో ప్రతిభ కనబర్చాడు. విశాఖ పట్నంలో ఉన్న ఓ ప్రైవేటు విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈసందర్భంగా ఎంఈవో రాజ్‌కుమార్ విద్యార్థి తల్లిదండ్రులను బుధవారం సత్కరించారు. ● రామభద్రపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆరికతోట గ్రామానికి చెందిన జాగాన యోగేశ్వర్ 99.876 పర్సన్‌టైల్ సాధించాడు. యోగేశ్వర్ విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివాడు.

తక్కువ యూనిట్లకు ఎక్కువ బిల్లు



విద్యుత్ బిల్లును చూపిస్తున్న మధుసూదనరావు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ బిల్లులు అధిక మొత్తంలో రావడంతో వినియోగ దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గరుగుబిల్లిలో బి.సురేష్‌కు చెందిన చిన్నపాటి దుకాణాన్ని మజ్జి మధుసూదనరావు అద్దెకు తీసుకున్నారు. చిన్నపాటి వ్యాపారం నిర్వహిస్తున్న ఈయనకు గత డిసెంబరు నెలలో 38 యూనిట్లకు రూ.16,579లు బిల్లు వచ్చింది. ఈ సమస్యను సంబంధిత విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో కొంతమేర తగ్గింపు చేశారు. ప్రస్తుతం జనవరి నెలకు 38 యూనిట్లు వినియోగించినట్లు, దీనికి రూ.8,265లు చెల్లించాలని బిల్లును అందించారు. అయితే తాను తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తున్నానని, అధిక మొత్తంలో బిల్లు రావడంతో మధుసూదనరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై స్పందించాలని కోరుతున్నారు.

సాఫ్ట్‌వేర్‌లో తప్పిదాల కారణంగా..

దీనిపై మండల విద్యుత్ సబ్ ఇంజినీర్ బి.శంకరరావు దృష్టికి తీసుకువెళ్లగా బిల్లు రీడింగ్‌కు సంబంధించి నూతనంగా సాఫ్ట్‌వేర్ అమలులో ఉందన్నారు. సాఫ్ట్‌వేర్‌లో తప్పిదాలు కారణంగా రీడింగ్‌లో కొంతమేర సమస్యలు నెలకొంటున్నాయన్నారు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పరిశీలన చేసి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు.

బంద్‌కు తాత్కాలిక విరమణ



మాట్లాడుతున్న ఏజేఏసీ నాయకులు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గిరిజనుల కోసం రూపొందించిన 1/70 చట్టాన్ని సవరణ చేయాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం తలపెట్టిన బంద్‌కు తాత్కాలిక విరమణ ఇస్తున్నట్టు ఏజేఏసీ మండల అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, సీపీఎం నాయకుడు తిరుపతిరావు తెలిపారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన చట్టాలను సవరణ చేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో బంద్‌కు తాము తాత్కాలిక విరమణ ఇచ్చామన్నారు. మన్యం బంద్‌కు మద్దతు తెలిపిన గిరిజన సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. బిడ్డిక అప్పారావు, భాస్కరరావు ఉన్నారు.

1/70 చట్టంపై స్పష్టమైన ప్రకటన చేయాలి

సాలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 1/70 చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు, జేఏసీ నాయకుడు సీదరపు అప్పారావు డిమాండ్ చేశారు. పట్టణంలో బోసుబొమ్మ వద్ద బుధవారం జరిగిన సమావేశంలో 1/70 చట్టం అమలు రక్షణకు చేస్తున్న బంద్ విరమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఫిబ్రవరి 24 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో 1/70 చట్టం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు. మండల కార్యదర్శి వంతల సుందర్రావు, కొండగొర్రి ఉదయ్‌కుమార్, సీపీఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, ఆయోధ్య పాల్గొన్నారు.

స్పీకర్ వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకం

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకమని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. బుధవారం ఆమె చినమేరంగి గ్రామంలోని తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. 1/70 చట్టంపై తప్పుగా మాట్లాడింది స్పీకర్, బంద్ ప్రకటించింది గిరిజన జేఏసీ, మధ్యలో వైసీపీ ఏమి చేసిందని మండిపడ్డారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వైసీపీపై నిందారోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బెలగాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలోని కొత్తవలస పురపాలక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంను అక్రమంగా సస్పెండ్ చేశారని, వెంటనే ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం నిరసన చేపట్టారు. అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. విద్యావ్యవస్థపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, రాము, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులు సమయ పాలన పాటించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని వల్లరిగుడబ, పెదగుడబ, కొత్తపల్లి పంచాయతీల్లో నిర్వహిస్తున్న పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనదారుల సంఖ్య పెంచేందుకు మేట్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పనులకు సంబంధించి మస్టర్లలో తేడాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. ఈ పరిశీలనలో క్షేత్ర సహాయకులు ఎ.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

పాలకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎన్.హిమప్రభ, ప్రాజెక్టు కార్యదర్శి బి.అమరవేణి కోరారు. ఈ మేరకు బుధవారం పాలకొండలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సిమ్మాలమ్మకు వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు.

న్యూస్ బాక్స్

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో అద్భుతంగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఇటీవల విజ్ఞాన్ యూనివర్శిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి పారా క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ జట్టులో పాల్గొన్న క్రీడాకారులు శ్రీను, నరేష్.. బుధవారం మంత్రిని సాలూరులోని తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను అభినందించారు. క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కురుపాం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): కురుపాం గ్రామదేవత పైడిమారమ్మతల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం పలువురు విరాళాలు అందజేశారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ ఐఏవీ ప్రసాద్‌లాల్, లక్ష్మీలాల్ దంపతులు రూ.3లక్షల 50వేలు, విశ్రాంత ఉపాధ్యాయుడు పల్ల సింహాచలంనాయుడు రూ.లక్ష విరాళం అందజేశారు.

యువతకు క్రీడాస్ఫూర్తి అవసరం

భామిని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడా స్ఫూర్తితో మెలగాలని బత్తిలి ఎస్‌ఐ అనీల్‌కుమార్ అన్నారు. బత్తిలిలో స్ట్రైక్‌స్టార్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. బత్తిలి సర్పంచ్ టింగ అన్నాజీరావు, జనసేన కన్వీనర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో 20 జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు.

పల్లె పండుగ పనులు పూర్తి చేయండి

వీరఘట్టం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు సమావేశ మందిరంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటికుంటలు, గోశాలల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఏపీవో జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

జనవాహినిలో వినతుల స్వీకరణ

వీరఘట్టం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు పాల్గొని, వినతులు స్వీకరించారు. తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడారు.

రక్తదానంతో ప్రాణదానం

సాలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని సాలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.భాస్కర్ రెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పీఎస్ ఎస్ఎస్ ప్రసాదరావు అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సాలూరు ఆర్టీసీ డిపోలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, మోటార్ కార్మికులు పాల్గొన్నారు.